# సుశీలా పరిణయం X

రచన:
శ్రీ దివాకర్ల సన్యాసిరావు

(గత సంచిక తరువాయి)

'నువ్వు దిగులుపడవద్దు ఆనంద్‌ని నీకు అప్పగించే భారం మాది.'

'మరికొంతసేపుండి సంధ్య చీకట్లు అలుముకోగానే సుశీలను యింటికి దిగపెట్టి వెళ్ళిపోయారు అరుణ, పద్మలిద్దరూ.

× × ×

మర్నాడు కాలేజీలో గరల్సువిశ్రాంతి రూమ్‌లో ఒక సమావేశం ఏర్పాటైంది,

అరుణ, పద్మలు, గదిలోపచార్లు చేస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. మరో నలుగురమ్మాయిలు (సుశీల శ్రేయోభిలాషులే) టేబుల్ మీద కూర్చున్నారు.

సుశీల దిగులుగా కూర్చోడానికి కారణం ఆ రోజు ఆనంద్ దర్శనం కలగకపోవటమే.

అదేసమయంలో మరీ రెండు జడలమ్మాయి ప్రవేశించింది ఆ రూమ్‌లోకి.

'ఏంవోయ్ మాలతీ ఏమిటి విశేషాలు ?' అంది పద్మ వెంటనే. ఆ మాలతి నామ ధేయురాలు అలసిపోయినట్లుంది. పాపం టేబుల్ ఎక్కి నలుగు రమ్మాయిల ప్రక్కన కూర్చుంది.

వెంటనే యిద్దరమ్మాయిలు చెంగులతో విసరడం మొదలెట్టారు.

'చెప్పవోయ్ త్వరగా సస్పెన్సుతో చంపక.' అంది అరుణ.

'చెప్పేదాకా ఆగండిమరి _ మా అన్నయ్య ఆనంద్ క్లాసుమేట్సు. ఆనంద్‌కి మేనమామ కూతురెవరో ఉందట, వారి కుటుంబాలు ఏవో కారణాలవల్ల వేరయ్యారట, యిప్పుడు ఆనంద్ ఆ మేనమామ కూతుర్ని పెళ్ళాడి, వారి రెండు కుటుంబాలని కలపడానికి కంకణం కట్టుకున్నాడట. ఆమె పట్టి పల్లెటూరి పిల్లట. అయినా చదువుకున్న అమ్మాయిలకన్నా ఆ పిల్లే ఎంతో తెలివిగలది. అందమైనదీ నట. ఆరు నూరైనా, నూరు ఆరైనా ఆ పల్లెటూరి పిల్లని తప్ప మరొకళ్లని పెళ్ళాడనని _ మా అన్నయ్యతో చెప్పాడట ఆనందు.' అంది మాలతి.

కొంతసేపటికి మెల్లగా కళ్ళు తెరిచింది సుశీల.

'సుశీల!! అలాదిగులు పడితే ఎలా మన ప్రయత్నంలో మనం ఉందాం. మనం తలచుకుంటే చెయ్యలేని దేముంది _ మహామహులకే దిక్కులేదు _ ఈ ఆనంద్ ఒక లెక్కా _' అంది పద్మ.

వంట్లో బాగులేదని లీవు లెటరు వ్రాసియిచ్చి అరుణ సాయంతో యిల్లు చేరుకుంది సుశీల.

సుశీల రూపంచూసి బేజారెత్తిపోయారు బామ్మగారు.

ఎంత గింజుకున్నా అవగాహనకాలేదు బామ్మగారికి.

మూడోనాడు కాలేజీకి వెళ్ళింది సుశీల. మధ్యాహ్నం లంచ్ టైమ్‌లో వంటరిగా కూర్చున్న సుశీల దగ్గరకి సుడిగాలిలా దూసుకొచ్చింది అరుణ,

'సుశీలా! కొంప మునిగింది ఆనంద్ వస్తున్నాడు నీ కోసం....' అంటూ ఉండగానే ఆనంద్ వచ్చాడు ఆరూమ్‌లోకి.

ఎన్నాళ్ళో ఆనంద్‌కోసం తపించిన సుశీలకి ఆనంద్ దగ్గరకి రాగానే ఆత్రుత, సిగ్గూ ముంచుకొచ్చాయి. ఎందుకొచ్చారు ?

నాకోసమే వచ్చారా! అని ఆలోచిస్తూ లేచి నిలబడింది.

'సుశీలగారూ! సభ్యత, సంస్కారం ఉన్న మీ లాంటివారు కూడా ఇలాంటి పాడుపనులు చెయ్యడం ఏమీ బాగులేదు' అన్నాడు ఆనంద్.

'ఆశ్చర్యంగా చూస్తూ ఉండి పోయింది సుశీల.

'ఏం చేసిందండీ?' అంది ప్రక్కనున్న అరుణ.

'చూడండి. మీరు ప్రేమలు, పెళ్ళిళ్ళకోసమే కాలేజీకి వస్తారా?. ఛీ....అమ్మాయిలే యింత లాధిగ జారిపోతే ఏంటనుకోవడం...' అని చేతిలో ఉన్న కవరు అందించాడు ఆనంద్.

కవరులోనున్న ఉత్తరం గబగబాచదివి ఆశ్చర్యపోయింది అరుణ.

'సుశీల ! ఈ లవ్ లెటర్ నువ్వురాశావా!' అంది ఉత్తరం అదిస్తూ.

'ఆ ఉత్తరం చదివిన సుశీలకి కళ్ళు బైర్లుకమ్మాయి. తను వ్రాసినట్టే ఉంది తన పేరే అడుగున ఉంది. ఎవరు వ్రాశారు! మౌనంగా ఉత్తరాన్నే చూస్తూ ఉండిపోయింది.

'సుశీ! నువ్వు వ్రాసిందేనా!' మళ్ళీ అడిగింది అరుణ.

'లేదు అరుణా! కిట్టని వాళ్ళెవరో చేసినపని...'అంది సుశీల.

'కాకపోతే మీరని ఎలా ఒప్పుకుంటారు. యిన్నాళ్లు మీరు మంచివాళ్ళేమో అనుకున్నాను. మీరు కూడా యింత అసభ్యంగా ప్రవర్తిస్తారనుకోలేదు.' అని గబ గబా వెళ్ళిపోయాడు ఆనంద్.

ఏడుపొచ్చినంతపనైంది సుశీలకి. దిగులుగా తల పట్టుకుని కూలబడిపోయింది కుర్చీలో.

'సుశీ! ఎవరు వ్రాసుంటారు? అబ్బే!! అచ్చంగా నువ్వు వ్రాసినట్టే ఉంది. అయినా యితనికెంత గర్వం. సిగ్గూ, బిడియంలేకుండా నోటి కొచ్చినట్లూ అనేస్తాడా నిజానిజాలు తెలుసుకోకుండా:

సుశీ! ఆ గర్వం, అహంభావం అణగగొట్టాలి. ఈ ఉత్తరం సంగతి తరువాత ఆలోచిద్దాం 'మోసాన్ని మోసంతోనే జయించాలి. వస్తానుండు' అంటూ వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు మరో సమావేశం ఏర్పాటైంది గరల్సు వెయిటింగ్ రూంలో.

'సుశీ! ఈ లెటర్ ప్రిన్సిపల్ గారికి అందజెయ్' అంది అరుణ ఒక లెటర్ యిస్తూ.

'అమ్మో! నేనిలాంటి పని చెయ్యను' అంది సుశీల.

'సుశీ! నీకు తెలీదు. ఆ గర్వం అణిగితేనే, ఆనంద్ నీవాడౌతాడు. మరేంభయం లేదు వెళ్ళు, నేను చెప్పినట్లు చెయ్యి' అంది అరుణ సుశీలని లేవనెత్తి.

× × ×

సుశీల యిచ్చిన ఉత్తరం చదివి ప్రిన్సిపాల్ గారు ఆశ్చర్యపోయారు. వెంటనే ప్యూన్ని పిలిచి ఆనంద్ని తీసుకు రమ్మన్నారు. ఆనంద్ రాగానే 'మిస్టర్ ఆనంద్ వాట్ ఈజ్ దిస్?' అంటూ లెటర్ అందించారు. ఆ ఉత్తరం చదివి ఆశ్చర్యంగా సుశీల వైపు, ప్రిన్సిపాల్ గారి వైపు, చూశాడు ఆనంద్.

'ఏం! మాట్లాడవు?' అన్నారు ఆయన కోపంగా.

'యిది నేను వ్రాయలేదు సార్.' అన్నాడు ఆనంద్.

'షటప్!!! అరిచారు ఆయన' అమ్మాయిల కిలవ్ లెట వ్రాయడానికి, సరసాలాడ్డానికి వచ్చావా! చేసిన తప్పుకి క్షమాపణ చెప్పుకోడానికి బదులుగా అబద్దాలు కూడానా.'

'చెయ్యని నేరానికి క్షమాపణ చెప్పుకోవలసిన అవసరం నాకు లేదు' అన్నాడు ఆనంద్.

'డోంట్ ఆర్గ్యూవిత్ మీ. యుగోఅవుట్. రేపటి నుండీ కాలేజీకి రానవసరంలేదు కూడా' అన్నారు ప్రిన్సిపాల్ కోపంగా. తృళ్ళిపడింది సుశీల. 'సార్ ఏదో చెప్పబోయింది.

'నువ్వు వెళ్లమ్మా' అన్నారాయన.

'సార్! యిది అన్యాయం......'

'డోంట్ టాక్ మోర్. యూగోఫస్టు.'అన్నారాయన' ఆనంద్.

పూర్తిగా చెప్పకుండానే. తలవంచుకొని వెళ్ళిపోయాడు ఆనంద్.

అనవసరంగా ఆనంద్ భవిష్యత్తుని, అతని అభివృద్దిని పాడుచేశానని కుళ్ళికుళ్ళి ఏడ్చింది సుశీల.

'అరూ! యిక ఏముఖంపెట్టుకొని ఆనంద్ తో మాట్లాడ్డం?

అతనికెలా క్షమాపణ వేడుకోవడం? ఛీ! యిలాంటి బ్రతుకు బ్రతికేకన్నా ఎందులోనన్నా పడిచావడం మేలు.' అంటూ వాపోయింది సుశీల.

'సుశీ! యిలా జరుగుతుందని కలగన్నామా! నువు దిగులు పడకు.' అని సముదాయించబోయింది అరుణ.

× × ×

సుశీ...సుశీ....ఆనంద్ యిప్పుడు ఉద్యోగం చేస్తున్నాడు.

స్టేట్ బాంక్లో ఉద్యోగం దొరికిందట నిన్న మాయింటి కొచ్చాడు మరి చదవట. అంది అప్పుడే వచ్చిన మాలతి.

'చూశావా - ఈడ్చి తంతే బూర్లెబుట్టలోపడ్డాడు' అంది అరుణ నవ్వుతూ.

మౌనంగా కూర్చుంది సుశీల ఏదో ఆలోచిస్తూ.

× × ×

సుశీల ఆరోగ్యం బాగులేదని వ్రాసిన బామ్మగారి

ఉత్తరానికి, జవాబుగా సుశీల నాన్నగారు వ్రాసిన ఉత్తరమందిన వెంటనే వస్తున్నానని సుశీలనీ తీసు కెళతానని వ్రాశాగ.

'వెళ్ళుసుశీ! ఈ బాధైనా మర్చిపోగలుగుతావు కళ్ళు లోతుకుపోయి, వాడిపోయిన ముఖంతో యిప్పు డెలాగైపోయావో చూడు' అంది పద్మ.

ఆ మర్నాడే సుశీల తండ్రి వచ్చి సుశీలని, బామ్మ గారిని తీసుకోని వాళ్ల గ్రామం బయలు దేరారు.

సుశీల వాళ్ళూ వచ్చిపదిరోజు లైంది.

సుశీల రోజురోజుకీ చిక్కిపోవడం చూసి గాభరా పడ సాగారు యింట్లో అందరూ. ఏం జబ్బో తెలియ లేదు.

ఒకనాడు సుశీల వీధి గుమ్మంలో కుర్చీవేసుకొని కూర్చుంది.

అప్పుడే ఒక జట్కాబండి వచ్చి గుమ్మం ముందా గింది.

ఎవరొచ్చారు చెప్మా!! అని అటు చూసింది సుశీల.

ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని ఉండి పోయింది.

ఆనంద్!! కలా నిజమా!! అనందేనా?!'

జట్కాదిగి - గుమ్మంలో కూర్చున్న సుశీలని చూసి ఆశ్చర్యంతో ఆనంద్ కూడా నోరు వెళ్ళ బెట్టాడు.

కొంతసేపటికి తేరుకొని-

'పరంధామయ్యగారిల్లు యిదేనా అండీ' అన్నాడు.

'ఆ....అ...వును' అంది సుశీల తడబడుతూ.

అప్పుడేపైకొచ్చిన సుశీల బామ్మగారు ఆనంద్‌ని చూసి కొంతసేపు ఆశ్చర్యపడిపోయి అవురా ఆనందం! నువ్వేనా?!' అన్నారు.

వీధిలొంచి వస్తున్న పరంధామయ్యగారు ఆనంద్‌ని పరిశీలనగా చూసి 'ఆనందం, నువ్వేనా!! యిది కలా నిజమా?!' అన్నారు ఆశ్చరంంగా.

'నేనే మామయ్యా!' అన్నాడు ఆనంద్.

'పద...పద...గుమ్మంలోనే నిలబడిపోయావేమిటి.

ఎంతవాడివయ్యావోయ్' అన్నారు పరంధామయ్యా గారు ఆనంద్‌ని లోపలికి తీసుకెళుతూ.

'ఏంరా! ఆనందం! మీ నాన్నకి మేం అక్కర్లేక పోయినా నీకు కావలసివచ్చాం. అంతేచాలు, అనవస రంగా మనస్పర్ధలు పెంచుకొని యిరవై సంవత్సరాలు ఉత్తరం ముక్కైనా వ్రాయకుండా వేరైపోయారు. నువ్వు పెద్దవాడివయ్యావు నువ్వే మళ్ళీ అందర్నీ కల పాలినాయనా!' అన్నారు బామ్మగారు.

'సుశీలకంతా అయోమయంగా ఉంది.

'బామ్మా! ఆ గుమ్మంలో కూర్చున్న అమ్మాయి ఎవరు?''

మన సుబ్బులేదీ! కనపడదేం?' అన్నాడు ఆనంద్.

బోసినోటితో నిండుగా నవ్వారు మామ్మగారు.

మనసుబ్బు లేరా ఆ గుమ్మంలో కూర్చున్నది. యిక్కడ చదువైంతరవాత పట్నంలో చదువుతానని మారాంచేసింది. పట్నంలో ఒక యిల్లు అద్దెకి తీసుకొని సుశీలకి వండిపెడుతున్నాను. ఈమధ్య దానికి వంట్లో బాగులేదు, ఏం జబ్బో ఏమిటో ఆ చలాకీతనం అంతా ఏంచైందో!?' అన్నారు బామ్మగారు.

'సుశీ ఎవరూ!?' అన్నాడు ఆనంద్ అయోమయంగా.

'మన సుబ్బులే సుశీలరా వెర్రినాగమ్మా!! పట్నంలో చదువుతోంది కదా! సుబ్బు అంటే నలుగురూ నవ్వుతా రని సుశీలగా మార్చుకుంది' అన్నారు నవ్వుతూ.

× × ×

చి॥ సౌ॥ సుశీలకు, చి॥ ఆనంద్‌కి వివాహం అన్న శుభలేఖ చూసి అరుణ పద్మలు, బోల్డు ఆశ్చర్యపడి పోయి అసలు విషయం తెలుసుకోడానికి అరోజే బండెక్కినారు.


## కథాంజలి

(తెలుగు మాస పత్రిక)

| | |
|---|---|
| విడి ప్రతి. | ... 25 పై. లు |
| సంవత్సర చందా. | ... రూ. 4-00 |

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, మరియు స్వదేశీ మిత్ర బుక్ స్టాల్సులలోను దొరుకును.